క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి

గోపవరం : అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ తెలిపారు. ప్రతి రైతు ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి సిబ్బంది ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గతంలో రైతు లేకుండా ఆధార్ కార్డు ద్వారా చేయించుకునే వారని, ప్రస్తుతం తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. బేతాయపల్లె రైతు సేవా కేంద్రంలో ఎరువు అందుబాటులో ఉందని, రైతులు తీసుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని లేపాక్షి డిగ్రీ కళాశాలలో ఈనెల 16న సోమవారం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప కొప్పర్తిలోని ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై 19 నుంచి 32 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.12,400 నుంచి 18వేల వరకు వేతనం, అటెండెన్స్ బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, ఓటీ సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9030008941, 7207088646 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీకి సత్కారం

పోరుమామిళ్ల : ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, తులశమ్మ దంపతుల వివాహ దినోత్సవం కావడంతో పలువురు వారిని శాలువా, పూలబొకెలతో సత్కరించారు. పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో గోవిందరెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో ఎరువులు

అట్లూరు : రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఎంఆర్పీ ధరకే రైతులు తీసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సజ్జ, వరినారు, వరిపంట రైతులు సాగు చేశారని, వాటికి అవసరమైన యూరియా అట్లూరు, గోపవరం రైతు సేవా కేంద్రాల్లో ఉందన్నారు. బ్లాక్ మార్కెట్లలో అధిక ధరలకు కొనుగోలు చేసి నష్టపోవద్దని ఆయన సూచించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో స్కూల్ జోన్లు ఉన్న ప్రాంతంలో రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఎన్‌డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, ఎన్‌టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. మోడంపల్లె బైపాస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో హైస్కూల్ ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్అండ్‌బీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజుపాళెం : మండలంలోని తొండలదిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆ వైద్య శిబిరానికి వైద్యులు కిమ్స్ సవేరా ఆసుపత్రి నుంచి వస్తున్నారని, ఆయా గ్రామస్తులు ఈ వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకుని, విజయవంతం చేయాలని వారు కోరారు.

సన్మానం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిరాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు ఘనంగా సన్మానించారు. కడపలో శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం కార్యక్రమంలో పశువైద్య కళాశాల విద్యార్థులతో 115 యూనిట్ల రక్తదానం చేసేందుకు ప్రోత్సహించినందుకు వీరిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగారాజు, జిల్లా ఉపాధి, పర్యాటక అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

కాశినాయన : మండలంలోని అక్కంపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్ఓ చెంచురెడ్డి తల్లి సుబ్బలక్ష్మమ్మ శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి అక్కంపేట గ్రామానికి వెళ్లి సుబ్బలక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక వివేకానంద కాలనీలోని వాత్సల్య చారిటబుల్ ట్రస్టులో శనివారం చిన్నారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ధనిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా వాత్సల్య చారిటబుల్ ట్రస్టులోని 150 మంది చిన్నారులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి స్వయంగా భోజనం వడ్డించారు.

భాషా పండితులు.. బదిలీ వెతలు

- ఏడాదికోమారు బలవంతపు బదిలీలు
- ఆరేళ్లలో నాలుగోసారి భాషా పండితులు బదిలీ బాధలు
- కుటుంబం గందరగోళం.. అటకెక్కిన విద్యార్థుల చదువులు
- వలసకూలీ బతుకుల మాదిరిగా భాషా పండితుల బతుకులు
- హైకోర్టు తీర్పును అమలు చేయని కూటమి ప్రభుత్వం

బద్వేలు : ప్రభుత్వ శాఖల్లో అతిపెద్ద శాఖ విద్యాశాఖ.. చాలా సున్నితమైన శాఖ కూడా అదే.అయితే ఇప్పుడు ఆ శాఖలో జరిగే బదిలీల్లో నెల రోజుల నుంచి గందర గోళం ఏర్పడింది. దీంతో ఒకే శాఖలో ఒక వర్గం వారికి మేలు జరిగితే మరోకరికి అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు మొదలయ్యాయి. ఇక పోతే మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా భాషోపాధ్యాయుల సమస్య 2019 నుంచి రెంటికి చెడిన రేవడిలా తయారైంది. భాషోపాధ్యాయులు తెలుగు, ఉర్దూ, కన్నడ, తమిళ మరియు పీఈటీలను 2019 సంవత్సరంలో గ్రేడ్ 2 రద్దు చేసి గ్రేడ్ 1 చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అప్‌గ్రేడేషన్ చేసింది. ఫలితంగా రాష్ట్రంలో 12,500 ఉపాధ్యాయుల ప్రమోషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే అప్పట్లో సెకెండ్ గ్రేడ్ టీచర్స్ అడ్డుపడి మాకు పదోన్నతులు కావాలని కోర్టుకు వెళ్లి భాషా పండితుల పదోన్నతులకు అడ్డుపడ్డారు. దీంతో అప్పట్లో పదోన్నతులు జరిగిన తరువాత 1300 మంది భాషా పండితులు మిగలగా వారందరినీ డీఈఓ పూల్‌లో ఉంచారు. ఇప్పుడైనా ప్రమోషన్ కల్పిస్తారనుకుంటే అది జరిగేటట్లు కన్పించడ ంలేదు. ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాలు కూటమి మూకపాలనకు జేజేలు కొడుతూ భాషోపాధ్యాయులపై నోటితో నవ్వి.. నొసలుతో చిట్లించినట్లు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారు. దీంతో ఆరేళ్లుగా భాషాపండితులును ఏడాదికో బదిలీతో ప్రభుత్వం ఆడుకుంటోంది. అంతేగాకుండా ఎక్కడో కలసపాడులో పనిచేసే ఉపాధ్యాయుడిని నెల్లూరు జిల్లా చివర ఉన్న చిట్వేల్ మండలానికి దాదాపు (160 కిలోమీటర్లు దూరం) బదిలీ చేస్తారు. మరల అక్కడినుంచి ఏడాదికే బద్వేలు (150 కిలోమీటర్ల) దగ్గర మారు మూల ప్రాంతానికి బదిలీ చేసి బలితీసుకుంటున్నారు. అందులో మహిళల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. దీంతో డీఈఓ పూల్‌లో ఉన్న



ఉపాధ్యాయుల కుటుంబాలు గందర గోళానికి గురికాగా ఏడాదికో స్కూల్ మారు తుండటంతో వారి పిల్లల చదువులు కూడా అటకెక్కుతున్నాయని భాషాపండితులు వాపోతున్నారు. ఉన్న క్యాడర్ లేక (గ్రేడ్ 2 తెలుగు పండిట్) పదోన్నతులు(గ్రేడ్1 తెలుగు పండిట్.. స్కూల్ అసిస్టెంట్) లేక గాలిలో తేలియాడుతున్నారు. 2019లో జీ.ఓ.ఎం.ఎస్.91 ద్వారా అందరికీ (భాషాపండితులకు) పదోన్నతులు కల్పించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎస్‌జీటీ ఉపాధ్యాయులు కోర్టు ద్వారా అడ్డుపడటంతో చేసేది లేక జీ.ఓ.ఎం.ఎస్.77 ను అమలు చేయాల్సి వచ్చింది. ఈ నిబంధనలతో అప్పుడు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పదోన్నతులు పొందగా అర్హులైన భాషాపండితులు 1300 మందికి ప్రమోషన్ అవకాశాన్ని కోల్పోయారు. దీంతో భాషా పండితులకు ఉన్న లాంగ్వేజ్ క్యాడర్ కూడా లేకుండా పోయింది. వర్కు అడ్జెస్ట్మెంట్ పేరుతో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడకు బదిలీ చేస్తున్నారు.

హక్కులకు, ప్రయోజనాలకు దూరం

2019లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయు (తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కతం, కన్నడ) పదోన్నతులు జరిగాయి. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 1300 మంది మిగిలి పోగా వైఎస్సార్ జిల్లాలో114 మంది మిగిలి పోయారు. అందులో తెలుగు 68, హిందీ 33, ఉర్దూ 13 మంది ఉన్నారు. వీరందరూ డీఈఓ పూల్‌లో ఉన్నారు. అసలు ఈ ఉపాధ్యాయులది ఏ విభాగమో కూడా అర్థం కాకుండా పోయింది. భాషా పండితులను డిఈఓ.పూల్ కింద పరిగణించి వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హామీలు అమలు చేయండి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ గత ఏడాది ఆగస్టు 23న అన్నమయ్య జిల్లా మైసూరివారిపల్లె గ్రామసభ యందు మిగులు భాషాపండితులు పడుతున్న ఇబ్బందుల విషయాన్ని విన్నవించడం జరిగింది. మరోసారి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలుగు భాషా దినోత్సవం నాడు ముఖ్యమంత్రి దృష్టికి భాషాపండితుల ఇబ్బందులను తీసుకుని వెళ్లగా 77 జీఓను రద్దు చేసి భాషాపండితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ముఖ్యమంత్రి హామీ ఇచ్చి దాదాపు 10 నెలలైనా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని భాషాపండితులు కోరుతున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

ఆరేళ్లుగా ఏడాదికోమారు బదిలీలతో విసిగిపోయిన భాషాపండితులు ఎక్కడో ఒకచోట పర్మినెంట్‌గా ఉద్యోగ బాధ్యతలను ఇప్పించి న్యాయం చేయాలని హైకోర్టును వేడుకున్నారు. భాషా పండితుల బాధలనుక్షుణంగా విన్న హైకోర్టు ధర్మాసనం సింగల్ బెంచ్ గౌరవ జస్టిస్ మన్మధరావు డిసెంబర్ 20 2024న భాషాపండితులకు పదోన్నతులు కల్పించమని కూటమి ప్రభుత్వానికి ఆదేశాలు జారిచేసింది. అంతేగాకుండా 2019 నుంచి భాషా పండితులకు ఇవ్వవలసిన అన్ని సౌకర్యాలు కల్పించి మూడు నెలల గడువులో ప్రమోషన్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని అనా డే ఆదేశించింది. అయితే హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చి ఆరు నెలలైనా అమలు చేయలేదు. హైకోర్టు ఉత్తర్వులను కూడా విద్యాశాఖ ఉన్నత అధికారులు ఖాతర్ చేయడంలేదని పదోన్నతులకు నోచుకోని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైకోర్టు తీర్పు ప్రకారం స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలి



మాకు ఏ ఉపాధ్యాయ సంఘాలు న్యాయం చేయలేదు. మాకు న్యాయం చేసే వారు కేవలం న్యాయశాఖ, ప్రభుత్వం మరియు విద్యాశాఖాధికారులు మాత్రమే. మాకు వారిపైనే నమ్మకం ఉంది. కావున 2019లో మిగులిన భాషాపండితులకు జరగిన అన్యాయానికి హైకోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆతీర్పును అనుసరించి మాకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలని కోరుతున్నాం.

– లక్ష్మీనరసయ్య ఎల్.పి.తెలుగు పండిట్, రైల్వేకోడూరు

ఎనిమిదేళ్లు ఒకచోట ఉంచండి



విద్యాశాఖలో ఒకసారి బదిలీ జరిగితే ఉపాధ్యాయులకు ఇష్టం లేకపోతే రెండేళ్లకు మరల బదిలీలో వేరే స్థానం కోరుకోవచ్చు. ఇష్టమైతే ఉపాధ్యాయ హక్కుల ప్రకారం 8 ఏళ్లు ఒకేచోట ఉండే హక్కు ఉంది. కానీ ప్రస్తుతం మేము ఆరేళ్లుగా ఏడాదికో బదిలీ చవిచూడాల్సివస్తోంది. ఎస్ఏ, ఎస్‌జీటీలకు బదిలీలు జరిగినా ప్రతిసారీ.. రేషనలైజేషన్ జరిగిన సమయంలో మరొకరి కోసం ఏడాదికో సారి బదిలీలు కావలసి వస్తోంది. ఈ దుస్థితికి కారణం మా పోస్టుల్లో మాకు ప్రమోషన్ కల్పించకపోవడతో అన్యాయం జరుగుతో ంది. ఇప్పటికైనా మాపోస్టుల్లో మాకే పదోన్నతులు కల్పించి ఇతర ఉపాధ్యాయులకు ఉండే అన్ని హక్కులు మాకు ఉండాలని కోరుచున్నాం.

– స్వతంత్రబాబు, ఎల్.పి.తెలుగు ఉపాధ్యాయులు, చిట్వేల్

పవన్ కల్యాణ్ హామీని అమలు చేయండి



గత ఆరు సంవత్సరాలుగా డీఈఓ.పూల్ భాషాపండితులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని ప్రతి బదిలీల్లో భాషాపండితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నమయ్య జిల్లా మైసూరువారిపల్లె గ్రామసభలో ఉప ముఖ్యమంత్రికి నేనే స్వయంగా మాభాషా పండితుల బాధలు గురించి ఏకరువు పెట్టాను. పవన్‌కల్యాణ్ తెలుగు భాషా దినోత్సవం నాటికి మీకు పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్య మంత్రి హామీ నైనా అమలు చేసి మాకు పదోన్నతులు కల్పించండి. లేదా హైకోర్టు తీర్పునైనా అమలు చేయండి. ఏ విధంగానైనా మాకు పదోన్నతులు కల్పించి ఇప్పుడు జరిగే బదిలీల్లో న్యాయం చేయండి.

– సంగీత ఎల్.పి. తెలుగు పండితులు, ముక్కవారిపల్లె, ఓబులవారిపల్లె మండలం

యోగా సాధనతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు : రోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని ప్రముఖ డాక్టర్లు నాగస్తగిరిరెడ్డి, వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని శ్రీసరస్వతి విద్యామందిరిలో శనివారం యోగాంధ్రప్రదేశ్–2025లో భాగంగా ఆరోగ్య భారతి, శ్రీసరస్వతి విద్యామందిర్ సంయుక్తగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక పరిస్థితుల్లో శారీరక, మానసిక ఒత్తిడితో ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని అధికమించి ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. అనంతరం యోగా గురువు, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బశేఖర్ క్రియాత్మక యోగాపై ఆసనాలు, ధ్యానం నేర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, యోటా గురువులు రఘురామిరెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై మాక్ డ్రిల్

చాపాడు : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం మండల వ్యాప్తంగా అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీడీఓ వీర కిషోర్, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, సీహెచ్ఓ మహదేవయ్య, పీహెచ్ఎన్ సుకన్య పాల్గొన్నారు. ఇదే క్రమంలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల వద్ద స్థానిక ప్రజలు, విద్యార్థులకు యోగా చేయడంపై గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ నెల 21న ప్రజలందరూ పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా చేయాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : రోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని బద్వేల్ ఆర్డీవో ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మైదుకూరు రోడ్డులోని యస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలనంలో ముందస్తుగా యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానవుల జీవన విధానం గందర గోళంగా తయారైందని, ఈ పరిస్థితుల నుంచి బయటపడటానికి యోగా మంచి ఔషధమన్నారు. నిత్య జీవితంలో యోగాసనాలను అలవాటు చేసుకోవడం ద్వారా చక్కని క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడుతుందన్నారు. అనంతరం యోగా గురువులు అమర్‌నాథ్‌రెడ్డి, నందగోపాల్ నేతృత్వంలో యోగ సాధన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వివి.నరసింహారెడ్డి, అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ శ్రీకాంత్, ఆర్టీసీ డీఎం నిరంజన్, ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కాశినాయన : యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీఓ మైథిలి అన్నారు. నరసాపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం యోగా శిక్షకుడు యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్ రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా

మైదుకూరు : నేటితరం యువతలో ఒత్తిడి పెరిగిపోతున్నందున నిత్య జీవితంలో యోగా అవసరమని యోగా శిక్షకులు పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా శనివారం స్థానిక వెంకటేశ్వర విద్యాసంస్థల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజు 30 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని శిక్షకులు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ దుగ్గిరెడ్డి ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని పార్కులో శనివారం యోగాంధ్ర మాక్‌డ్రిల్ నిర్వహించారు. అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల వద్ద స్థానిక ప్రజలు, విద్యార్థులకు యోగా చేయడంపై గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ నెల 21న ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జున కోరారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి



చాపాడు పీహెచ్‌సీలో యోగా చేస్తున్న ప్రజలు, వైద్య సిబ్బంది



యోగా సాధన చేస్తున్న ఆర్డీవో, అధికారులు



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



బి.మఠంలో..

వైభవంగా వీరాంజనేయస్వామి ఉత్సవాలు

ఖాజీపేట : తవ్వారిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఉదయం నుంచి గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వామి వారి అభిషేక మహోత్సవంలో పాల్గొని అభిషేకం పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని కమిటీ సభ్యులు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఎద్దుల యజమానులకు ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

ఫ్యాక్షన్ నిర్మూలనతో గ్రామాలు అభివృద్ధి



మాట్లాడుతున్న రూరల్ సీఐ శివశంకర్

చాపాడు: గ్రామాలలో నెలకొన్న ఫ్యాక్షణ గొడవలు లేకుండా వాటిని నిర్మూలించడం వలన గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నవరదాయపల్లె గ్రామంలో శనివారం రాత్రి ఫ్యాక్షన్ నిర్మూలనపై కడప పోలీసు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవల వలన ప్రాణ, ఆస్తి నష్టాలతో అనేక విధాలుగా కుటుంబాలు నష్టపోతాయన్నారు. ఇదే క్రమంలో పిల్లలు, యువత చదువుకుని సన్మార్గంలో నడుస్తూ ఉన్నత స్థాయి చేరుకోవాల్సిన వీరందరూ వాటిని దూరమైన చిన్నాభిన్నమైన జీవితాలు గడపాల్సి వస్తుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా ప్రజలు కలసికట్టుగా పరిష్కరించుకోవాలని అలా కాని పక్షంలో చట్టాలు, న్యాయాలకు లోబడి పరిష్కార మార్గంలో వెళ్లాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని తెలిపారు. అపరితులు సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీలను ఇతరులు చెప్పవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, పోలీసు, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

మైదుకూరు : పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారావు ఒక ప్రకటపలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని ఆయన పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 కౌన్సిలింగ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఫీజు చెల్లించిన రశీ దు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, టీసీ, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ అర్హులైన వారు ఈడబ్ల్యూఎస్, ఆదాయ, ప్రత్యేక కేటగిరి సర్టిఫికెట్లు సమర్పించాలని వివరించారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్లను జూలై 1న మార్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జూలై 3న సీట్లను కేటాయిస్తారని, సీ ట్లు పొందిన అభ్యర్థులు సంబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం పి.చంద్రశేఖర్ 9885619364, డాక్టర్ జి.హెన్రీ థామస్ 8985257287లను సంప్రదించాలని సూచించారు

రేపటి నుంచి డిగ్రీ తరగతులు

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపటి నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు రేపటి నుంచి తరగతులు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి



డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డిని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నూతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల పదవీకాలం మూడేళ్లు ఉంటుంది. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఆర్‌సీపీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, అధ్యాపకులు కూరపాటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మధుసూదన్, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, సీపీఎస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, కడప జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు రమణ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

గోపవరం : మండల వ్యవసాయాధికారిగా అనకర్ల విజయరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అరవిందనాయక్ ఉన్నత చదువుల నిమిత్తం సెలవులో వెళ్లారు. అప్పటి నుంచి అట్లూరు ఏవో రామకృష్ణయ్య ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. తాజా గా మైలవరం ఏవోగా పని చేస్తున్న విజయరావును మండలానికి బదిలీ చేయడంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

అన్నదాత సుఖీభవకు ఈ కేవైసీ తప్పనిసరి

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకం రావాలంటే ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివరామ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేవైసీ కోసం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోకి వెళ్లి వేలిముద్ర వేయాలన్నారు. ఈ కేవైసీ చేయించుకున్న రైతుల పేర్లు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వ్యాప్తంగా 5702 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా ఉన్నారని, సరైన సమయానికి వేలిముద్ర వేస్తే ఈ పథకంలో లబ్ధిపొందుతారన్నారు. ఫోన్ ద్వారా వచ్చే ఓటీపీతో అవకాశం లేదని రైతులంతా గమనించి తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వేలిముద్ర వేయాలని సూచించారు.

ఉపాధ్యాయుడి కుమార్తెకు నీట్‌లో ర్యాంకు



తల్లిదండ్రులతో విద్యార్థిని హరిత

మైదుకూరు : మైదుకూరుకు చెందిన గంగులయ్య అనే ఉపాధ్యాయుడి కుమార్తె ఎస్. హరితకు నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంక్ లభించింది. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంగులయ్య, చిన్నక్క దంపతుల కుమార్తె హరితకు నీట్‌లో జాతీయ స్థాయి (క్యాటగిరి)లో 2,121వ ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థిని హరిత మాట్లాడుతూ దేశంలో ప్రతిష్ఠాత్మక మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చేయడమే తన లక్ష్యమని తెలిపింది. జాతీయ స్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థినిని పలువురు అభినందించారు.

పార్టీ అభిమాని మృతికి నివాళి



పూలమాల వేస్తున్న విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని తిరువెంగళాపురం గ్రామానికి చెందిన పులి భాస్కర్ వైఎస్సార్‌సీపీ అభిమాని. పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేశారు. అనారోగ్య కారణంతో శనివారం మృతిచెందిన సమాచారం తెలుసుకొని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి తిరువెంగళాపురం వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట అల్లా పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

అట్లూరు : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వంద రోజుల పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. మండలంలోని కమలకూరులో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కనిష్ఠంగా వంద రోజులపాటు పనులు కల్పించాలనే నిబంధన ఉన్నా, అధికారులు చర్యలు చేపట్టడంలేదన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో సిబ్బంది విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.